# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

## విశాఖపట్నం కేంద్రం

## జాతీయ వార్తలు

తేదీ: 24-07-2025 సమయం : రాత్రి 8 గం. 30 ని.లు

## ముఖ్యాంశాలు

- ❖ భారత్ బ్రిటన్ దేశాల మధ్య భాగస్వామ్యంలో నూతన అధ్యాయం ప్రారంభమైందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పేర్కొన్నారు.
- ❖ వివిధ అంశాలపై ప్రతిపక్షాలు ఆందోళన చేయడంతో పార్లమెంటు ఉభయ సభలు రేపటికి వాయిదా పడ్డాయి.
- ❖ జాతీయ సహకార విధానం 2025ను కేంద్ర మంత్రి అమిత్ షా న్యూఢిల్లీలో ఈ రోజు జరిగిన ఒక కార్యక్రమంలో ఆవిష్కరించారు.
- ❖ దేశంలో ఎల్‌పీజీ సిలిండర్ గ్యాస్ కనెక్షన్‌లను గత 11 సంవత్సరాల్లో 14 కోట్ల నుండి 33 కోట్లకు పెంచామని కేంద్ర మంత్రి హర్దీప్ సింగ్ పూరి తెలిపారు.
- ❖ భారత్ ఇంగ్లాండ్ జట్ల మధ్య జరుగుతున్న నాలుగవ టెస్టు మ్యాచ్ తొలి ఇన్నింగ్స్‌లో భారత్ 358 పరుగులకు ఆలౌట్ అయ్యింది.

================================

భారత్, బ్రిటన్ దేశాల మధ్య భాగస్వామ్యంలో నూతన అధ్యాయం ప్రారంభమైందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పేర్కొన్నారు. రెండు దేశాలు విజన్-2035 లక్ష్యంగా సాగుతున్నాయని తెలిపారు. చాలా ఏళ్ల కృషి తర్వాత భారత్-బ్రిటన్ మధ్య సమగ్ర ఆర్థిక, వాణిజ్య ఒప్పందంపై సంతకాలు జరగడం సంతోషకరమన్నారు. AI, సైబర్ సెక్యూరిటీ అంశాలలో ఇరు దేశాలు కలిసి ముందుకు సాగుతామని ప్రధానమంత్రి అన్నారు. ఈ ఒప్పందాల ద్వారా రెండు దేశాల సేవ, ఆర్థిక, సాంకేతిక రంగాలకు ఎంతో ప్రయోజనం కలుగుతుందని చెప్పారు. అలాగే సులభతర వాణిజ్య విధానానికి మరింత ఊతం వచ్చిందని వ్యాఖ్యానించారు. ఇరు దేశాల మధ్య ఉపాధి కల్పన అవకాశాలు మరింత విస్తృతం అవుతాయని నరేంద్ర మోదీ పేర్కొంటూ...

(వాయిస్ 27 సెకన్లు)

ఇదిలా ఉండగా, కీలకమైన స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందంపై భారత ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, బ్రిటన్ ప్రధానమంత్రి కీర్ స్టార్మర్ ఈ రోజు సంతకాలు చేశారు. ఈ ఒప్పందంతో సరళతరమైన వాణిజ్య విధానాలతో ఇరు దేశాలు పరస్పరం ఎగుమతి, దిగుమతులను ప్రోత్సహించనున్నాయి. భారత్‌కు చెందిన దాదాపు 95 శాతానికి పైగా వ్యవసాయ ఉత్పత్తులు, అలాగే శుద్ధి చేసిన ఆహార ఉత్పత్తులపై బ్రిటన్ ఇకపై ఎలాంటి సుంకాన్ని విధించదని అధికార వర్గాలు తెలిపాయి.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

వివిధ అంశాలపై ప్రతిపక్షాలు ఆందోళన చేయడంతో పార్లమెంటు ఉభయ సభలు రేపటికి వాయిదా పడ్డాయి. లోక్‌సభ ఈ రోజు ఉదయం 11 గంటలకు సమావేశమైనప్పుడు స్పీకర్ ఓం బిర్లా ప్రశ్నోత్తరాల సమయాన్ని ప్రారంభించారు. అయితే ప్రతిపక్ష సభ్యులు నినాదాలు చేసారు. ప్రశ్నోత్తరాల సమయం పూర్తయిన తర్వాత సభ్యులు లేవనెత్తాలనుకుంటున్న అంశాలపై నిబంధనల ప్రకారం మాట్లాడటానికి అనుమతిస్తానని ఓం బిర్లా తెలిపారు. అయితే విపక్షాల గందరగోళం కొనసాగడంతో, స్పీకర్ సభను మధ్యాహ్నం 2 గంటల వరకు వాయిదా వేశారు. భోజన విరామం అనంతరం లోక్‌సభ తిరిగి సమావేశమైనప్పుడు, బీజేపీ సభ్యులు నిషికాంత్ దూబే కమ్యూనికేషన్స్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీపై స్టాండింగ్ కమిటీ నివేదికలను ప్రవేశపెట్టారు. ఆ పార్టీకి చెందిన సభ్యులు జనార్దన్ మిశ్రా.. గ్రామీణాభివృద్ధిపై స్టాండింగ్ కమిటీ నివేదికలను కూడా ప్రవేశపెట్టారు. అనంతరం కేంద్ర న్యాయ శాఖ మంత్రి అర్జున్ రామ్ మేఘ్వాల్ గోవా రాష్ట్ర అసెంబ్లీ నియోజకవర్గాల్లో షెడ్యూల్డ్ తెగల ప్రాతినిధ్య పునర్ వ్యవస్థీకరణ బిల్లు, 2024ను లోక్ సభ ఆమోదం కోసం ప్రతిపాదించారు.

కాగా రాజ్యసభ ఈ రోజు తమిళనాడు రాష్ట్రం నుంచి పదవీ విరమణ చేస్తున్న ఆరుగురు సభ్యులకు వీడ్కోలు పలికింది. రాజ్యసభ డిప్యూటీ చైర్మన్ హరివంశ్ నారాయణ సింగ్ కొత్తగా నామినేట్ చేయబడిన సభ్యుడు ఉజ్వల్ నికంతో ప్రమాణ స్వీకారం చేయించారు. ఆ తర్వాత ప్రశ్నోత్తరాల సమయాన్ని చేపట్టారు. కానీ ప్రతిపక్ష సభ్యులు తమ సమస్యలపై నినాదాలు చేయడం ప్రారంభించారు. గందరగోళం మధ్య, ఆయన సభను మధ్యాహ్నం 2 గంటల వరకు వాయిదా వేశారు. తిరిగి సమావేశమైనప్పుడు సముద్ర మార్గంలో వస్తువుల రవాణా బిల్లు 2025ను రాజ్యసభ ఆమోదించింది.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

దేశంలో సహకార రంగాన్ని బలోపేతం చేస్తున్నామని కేంద్ర సహకార శాఖ మంత్రి అమిత్ షా తెలిపారు. వికసిత్ భారత్ 2047 లక్ష్యాన్ని సాధించే విషయంలో సహకార రంగం ముఖ్య పాత్ర పోషిస్తుందని అన్నారు. న్యూఢిల్లీలో ఈ రోజు జరిగిన కార్యక్రమంలో జాతీయ సహకార విధానం 2025ను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా అమిత్ షా మాట్లాడుతూ... క్షేత్ర స్థాయి నుంచి సహకార రంగాన్ని పటిష్టం చేసేందుకు జాతీయ సహకార విధానం 2025 ఎంతగానో ఉపకరిస్తుందన్నారు. దేశంలో మొట్టమొదటి జాతీయ సహకార విధానాన్ని 2002లో అటల్ బిహారీ వాజ్‌పేయి ప్రధానమంత్రిగా ఉన్నప్పుడు రూపొందించారని అమిత్ షా గుర్తు చేశారు. ఈ రంగం అభివృద్ధి కోసం కేంద్ర ప్రభుత్వం అనేక చర్యలను తీసుకుందని అమిత్ షా పేర్కొంటూ...

(వాయిస్ 39 సెకన్లు)

విరామం

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

దేశంలో ఎల్‌పీజీ సిలిండర్ గ్యాస్ కనెక్షన్‌లను గత 11 సంవత్సరాలలో 14 కోట్ల నుండి 33 కోట్లకు పెంచామని పెట్రోలియం సహజ వాయువు శాఖా మంత్రి హర్దీప్ సింగ్ పూరి తెలిపారు. లోక్‌సభలో ఈ రోజు కేంద్ర మంత్రి ఒక ప్రశ్నకు సమాధానమిస్తూ... బయోగ్యాస్ రంగంలో కూడా దేశం అద్భుతమైన పురోగతిని సాధించిందని చెప్పారు. సమ్మిళిత సహజ వాయువు (సిఎన్‌జి), పైపుల ద్వారా సరఫరా చేసే సహజ వాయువు (పిఎన్‌జి)తో సహా అన్ని రకాల ఇంధనాల పరివర్తనకు కేంద్రప్రభుత్వం కట్టుబడి ఉందని హర్దీప్ సింగ్ పూరి అన్నారు. పిఎన్‌జి కనెక్షన్లు 2014లో 25 లక్షల ఉంటే ఇప్పుడు కోటి 50 లక్షలకు పెరిగాయని వెల్లడించారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

దేశ రాజధాని ఢిల్లీలో ఏడు నూతన సూపర్-స్పెషాలిటీ ఆసుపత్రులను ఏర్పాటు చేయనున్నామని ముఖ్యమంత్రి రేఖా గుప్తా ప్రకటించారు. రాష్ట్ర సచివాలయంలో 34 ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్‌లను ఆమె ఈ రోజు ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, ఢిల్లీ నగరంలోని ప్రాథమిక ఆరోగ్య మౌలిక సదుపాయాలను అభివృద్ధి చేయడం మాత్రమే కాకుండా సూపర్-స్పెషాలిటీ ఆరోగ్య సేవలను కూడా బలోపేతం చేయాలన్నది ప్రభుత్వ లక్ష్యమని చెప్పారు. ఢిల్లీ నగరాన్ని ప్రపంచ ఆరోగ్య కేంద్రంగా మార్చడంలో కీలకమైన చర్యలు తీసుకుంటామని ముఖ్యమంత్రి పేర్కొన్నారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

భారతదేశంలో శక్తివంతమైన మీడియా వ్యవస్థ ఉందని కేంద్ర సమాచార ప్రసార శాఖ సహాయ మంత్రి డాక్టర్ ఎల్.మురుగన్ తెలిపారు. లోక్ సభలో ఈ రోజు ఆయన సభ్యులు అడిగిన ప్రశ్నకు లిఖితపూర్వక సమాధానం ఇచ్చారు. దేశంలో లక్షా 55 వేలకు పైగా ప్రచురణలు 908 ప్రైవేట్ టీవీ ఛానెళ్లతో శక్తివంతమైన ప్రెస్ మీడియా వ్యవస్థ ఉందని పేర్కొన్నారు. ప్రెస్ రిజిస్ట్రార్ జనరల్ ఆఫ్ ఇండియా వద్ద నమోదైన ప్రచురణల సంఖ్య 2014-15లో లక్షా 5 వేలు ఉంటే 2024-25 నాటికి కోటి 55 లక్షలకు పెరిగిందని అన్నారు. ప్రైవేట్ ఉపగ్రహ టీవీ ఛానెళ్ల సంఖ్య కూడా 821 నుండి 908కి పెరిగిందని వెల్లడించారు. అలాగే 92 ప్రైవేట్ ఛానెళ్లు 50 దూరదర్శన్ ఛానెల్స్ అందుబాటులో ఉన్నాయని తెలిపారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

ప్రముఖ విమానయాన సంస్థ ఎయిర్ ఇండియాకు డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ సివిల్ ఏవియేషన్ (డీజీసీఏ) ఈ రోజు నాలుగు నోటీసులు జారీ చేసింది. క్యాబిన్ సిబ్బంది విశ్రాంతి, వారి విధి నిబంధనలు, శిక్షణ నియమాలు, కార్యాచరణ విధానాలకు సంబంధించి ఎయిర్ ఇండియా పలు ఉల్లంఘనలకు పాల్పడినట్లు ఆ నోటీసులో పేర్కొంది. జూన్ 20, జూన్ 21వ తేదీల్లో డీజీసీఏకు ఎయిర్ ఇండియా స్వచ్ఛందంగా ఇచ్చిన వివరాల ఆధారంగా ఈ షోకాజ్ నోటీసులు జారీ చేసినట్లు సంబంధిత వర్గాలు తెలిపాయి.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

దాదాపు రెండు దశాబ్దాల క్రితం జరిగిన ముంబయి రైలు పేలుళ్ల కేసులో నిందితులుగా ఉన్న 12 మందిని నిర్దోషులుగా ప్రకటిస్తూ.. బాంబే హైకోర్టు ఇటీవల ఇచ్చిన తీర్పుపై తాజాగా సుప్రీం కోర్టు స్టే విధించింది. అయితే హైకోర్టు ఆదేశాలతో జైలు నుంచి విడుదలైన నిందితులను మళ్లీ అరెస్టు చేయాల్సిన అవసరం లేదని అత్యున్నత న్యాయస్థానం ఈ రోజు వెల్లడించింది. మహారాష్ట్ర ప్రభుత్వం చేసిన అపీల్‌పై తమ స్పందనను కూడా తెలియజేయాలంటూ నిందితులకు నోటీసులు జారీ చేస్తూ ఆదేశించింది.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

భారత్ ఇంగ్లాండ్ జట్ల మధ్య మాంచెస్టర్ వేదికగా జరుగుతున్న నాలుగవ టెస్టు మ్యాచ్ తొలి ఇన్నింగ్స్‌లో భారత్ 358 పరుగులకు ఆలౌట్ అయ్యింది. భారత్ బ్యాట్స్ మెన్‌లలో సాయి సుదర్శన్ అత్యధికంగా 61 పరుగులు చేయగా, ఇంగ్లాండ్ బౌలర్ బెన్ స్టోక్స్ ఐదు వికెట్లు తీశాడు. అనంతరం తొలి ఇన్నింగ్స్ ప్రారంభించిన ఇంగ్లాండ్ టీ విరామ సమయానికి వికెట్ నష్టపోకుండా 77 పరుగులు చేసింది.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

కర్ణాటక, ఒడిశా రాష్ట్రాల్లో రేపు భారీ నుండి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని భారత వాతావరణ శాఖ (IMD) తెలిపింది. అలాగే, మధ్య మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్, పశ్చిమ బెంగాల్, మధ్యప్రదేశ్‌లలో కూడా భారీ వర్షాలు కురుస్తాయని పేర్కొంది. బీహార్, తూర్పు ఉత్తరప్రదేశ్, జార్ఖండ్, ఉత్తరాఖండ్‌తో సహా ఈశాన్య భారతదేశంలో కూడా రేపటి వరకు భారీ వర్షాలు కురుస్తాయని ఐఎండీ వెల్లడించింది.

================================

================================